

త్వరలో ఉచిత డిఎస్సీ కోచింగ్

- స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ప్రారంభం
- ఎన్టీఆర్ ట్రస్టు స్కూలు ఏర్పాటుకు చర్యలు
- కుప్పంలో ముగిసిన నారా భువనేశ్వరి పర్యటన







ప్రజాశక్తి - కుప్పం టౌన్: మహిళల సంక్షేమం, ఆర్థిక బలోపేతమే లక్ష్యంగా ఎన్టీఆర్ ట్రస్టు ముందుకు సాగుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. కుప్పం పట్టణంలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌ను నారా భువనేశ్వరి ఎన్టీఆర్ ట్రస్టు సిబ్బందితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. తదనంతరం విలేకరుల సమావేశంలో భువనేశ్వరి మాట్లాడుతూ ఎన్టీఆర్ ట్రస్టును సేవా భావంతో చంద్రబాబు స్థాపించినట్టు తెలిపారు. ఆయన ఏ స్ఫూర్తితో ట్రస్టును స్థాపించారో... ఆ స్ఫూర్తిని తాను, తన సిబ్బంది ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. కుప్పంలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ మహిళా సంక్షేమమే ధ్యేయంగా పెట్టినట్టు తెలిపారు. మహిళలకు బట్టలు కుట్టడం నేర్పిస్తే వాళ్ల కాళ్లపై వాళ్లు నిలబడతారని తాము భావిస్తున్నట్టు తెలిపారు. కేవలం కుట్టు మిషన్లతోనే తాము ఈ కార్యక్రమాలు ఆపడం లేదని, మరిన్ని ఆలోచనలు ఉన్నాయన్నారు. బట్టల ఫ్యాక్టరీల వారితో చర్చించి, వారికి అవసరమైన రీతిలో బట్టలు కావాలో వాటిని స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లో శిక్షణ పొందిన వారితో కుట్టించి ఫ్యాక్టరీకి అమ్మేలా చర్యలు తీసుకుంటామన్నారు. వైర్ బుట్టలు, ఇతర చేతి పనులు ఏవైతే మహిళలకు ఆసక్తి ఉంటుందో వాటిలోనూ శిక్షణ ఇచ్చి ముందుకు తీసుకెళ్తామన్నారు. శిక్షణ తీసుకున్న మహిళలకు కోపరేటివ్ సొసైటీ ఏర్పాటు చేసి వారు మరింత అభివృద్ధి చెందేందుకు చర్యలు చేపడతామన్నారు. ప్రతి నియోజకవర్గంలో రాష్ట్ర వ్యాప్తంగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. కుప్పం నియోజకవర్గంలో ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా స్కూలు ఏర్పాటు చేసి, పేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందిస్తామన్నారు. కుప్పం నియోజకవర్గంలో నిరుద్యోగ మహిళలకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో ఉచితంగా డీఎస్సీ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. హైదరాబాద్ లో పెట్టిన విధంగా ఉచిత ఐఏఎస్ కోచింగ్ సెంటర్ ను కుప్పంలో పెట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. అనంతరం పిఇఎస్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో మహిళలకు ఎన్టీఆర్ ట్రస్టు తరపున కుట్టు మిషన్లను అందించారు. ఎన్టీఆర్ ట్రస్టు సిఇఒ రాజేంద్రకుమార్, ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్ పాల్గొన్నారు. నాలుగు రోజుల నారా భువనేశ్వరి పర్యటనలో 977 వినతులు అందాయి. అత్యధిక భాగం భూ సమస్యలే కావడం గమనార్హం. తన పర్యటన విజయవంతంగా ముగిసినందుకు చివరి రోజు శుక్రవారం గ్రామ దేవత శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మను దర్శించుకున్నారు.

పాల ఉత్పత్తి పెంపునకు చర్యలు చేపట్టాలి



- కలెక్టర సుమిత్‌కుమార్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: జిల్లాలో పాడి రైతులకు అవసరమైన సేవలందించేందుకు సచివాలయ స్థాయిలో పశు సంవర్ధక సహాయకులు అందుబాటులో ఉండాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం మ్యాంగో భవన్‌లో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న 282మంది పశుసంవర్ధక సహాయకులతో కలెక్టర్ సమావేశమై క్షేత్ర స్థాయిలో పశుసంవర్ధక శాఖ ద్వారా అందించే సేవలు, జిల్లాలో పాల ఉత్పత్తి పెంపునకు తీసుకోవలసిన చర్యలు, క్షేత్ర స్థాయిలో మరింత మెరుగైన సేవలు అందించేందుకు యంత్రాంగం తోడ్పాటు, తదితర అంశాలకు సంబంధించి సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 31మండలాలలో దాదాపు 5 లక్షల 50వేల మంది రైతులు వ్యవసాయంతో పాటు పాడిపోషణపై ఆధారపడి జీవిస్తున్నారని, వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ పాడి పోషణే జీవనాధారంగా ఉందన్నారు. పశు సంవర్ధక సహాయకులు వారి పరిధిలో ఉన్న పాడి పశువులకు సంబంధించిన పూర్తి సమాచారంతో పాటు రైతులకు సకాలంలో అందుబాటులో ఉండి సేవలందించేలా కృషి చేయాలన్నారు. పాడి పశువుల క్షేమాలను చూసుకోవాలని, గొర్రెల పంపకంపై మరింత అవగాహన కలిగించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు వర్తింపజేయటానికి సిబ్బంది పాత్ర కీలకమన్నారు. సమావేశంలో పశుసంవర్ధక శాఖ జేడి డాక్టర్ ప్రభాకర్, సహాయ సంచాలకులు, సహాయకులు పాల్గొన్నారు.

మామిడి భవన్ పరిశీలన

చిత్తూరు జిల్లా పండ్ల పరిశ్రమల సమైక్య సభ్యులు, సంస్థ కార్యదర్శి కట్టమంచి బాబి ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ సుమిత్ కుమార్‌ను ఆయన ఛాంబర్‌లో కలసి మామిడి గుజ్జు పరిశ్రమలో ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రం అందించారు. చిత్తూరులో ఇన్ ల్యాండ్ కంటైన డిపో ఏర్పాటు, సాలిడ్ వేస్ట్ ట్రీట్మెంట్ గురించి ఐఓసీ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారితో చర్చించి బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుపై వినతులను కలెక్టర్‌కు సమర్పించగా ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళి పరిశీలించడం జరుగుతుందన్నారు. అనంతరం కలెక్టర్ మామిడి భవన్‌ను సందర్శించారు. అక్కడి వసతులు, ప్రయోగశాలను, విదేశీ ఎగుమతుల కోసం చేస్తున్న పరీక్షలను పరిశీలించారు. కార్యక్రమంలో సభ్యులు సమీర్ శర్మ ధనంజయ నాయుడు, బషీర్, ధనుంజయ, విద్యాసాగర్ రెడ్డి, అమర్నాథ్ పాల్గొన్నారు.

అప్పులొద్దు.. గ్రాంట్ ఇవ్వండి.!

- ఆంధ్రకు మరో సారి మొండి చెయ్యేనా..
- వెనుకబడిన జిల్లాలను ఆదుకోరా..
- సామాన్యులపై భారం.. కార్పోరేట్లకు రాయితీలా..
- సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు ధ్వజం

ప్రజాశక్తి-పూతలపట్టు: కేంద్ర ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రానికి అప్పులు కాదు గ్రాంట్ ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. పూతలపట్టు మండలం బండపల్లి గ్రామంలో శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్రం బడ్జెట్‌లో మరోసారి ఆంధ్రాకు మొండి చేయి చూపిందన్నారు. గ్రాంట్ విడుదల చేయకుండా రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ వైఖరిని ప్రజలందరూ వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. సామాన్యులపై భారం మోపి కార్పోరేట్‌లకు రాయితీలు ఇవ్వడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. విభజన చట్టం, ప్రత్యేక హోదా ఊసే లేకుండా నిధులు కేటాయింపులు జరగలేదని మండిపడ్డారు. రాష్ట్ర ప్రయోజనాలను గాలికొదిలి టీడీపీ, జనసేనలు బీజేపీకి భజన చేయడం తగదన్నారు. అప్పును నిధులు మంజూరుగా ప్రచారం చేయడం మనల్ని మనం మోసం చేసుకోవడమే అవుతుందని స్పష్టం చేశారు. కడప స్టీల్ ఫ్యాక్టరీ, రామా యపట్నం ఓడరేవు, విశాఖపట్నం రైల్వే జోను పూసే లేకుండా పోయిందన్నారు. ఇలాంటి మోసపూరిత మాటలతో ఆంధ్ర ప్రజలను మరోసారి కేంద్రం మోసం చేస్తున్నదని ఈ మోసాన్ని ప్రజలందరూ ఐక్యంగా ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఒక రూపాయి కూడా ఇవ్వకుండా బయట నుంచి అప్పులు తీసి ఇస్తామని చెప్పడం దారుణం అన్నారు. ఇప్పటికే రాష్ట్రం అప్పులు ఊబిలో కూరుకుపోయి వడ్డీలు కట్టలేని పరిస్థితిలో ఉంటే మళ్ళీ ఆంధ్ర ప్రజలపై భారం మోపడం సిగ్గుచేటు అన్నారు. సామాన్య ప్రజలపై భారం తగ్గించి ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పూతల పట్టు మండల కార్య దర్శి జ్యోతిరావు తదితరులు పాల్గొన్నారు.



మహిళా హక్కు చట్టాలపై అవగాహన ఉండాలి

- అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: మహిళలపై జరుగుతున్న హింస, దాడులను ఎదుర్కోవాలంటే చట్టంలో మహిళ లకు ఉన్న హక్కులపై పూర్తి స్థయిలో అవగాహన పెంచుకోవాలని అడిషనల్ ఎస్పీ సుబ్బ రాజు తెలిపారు. ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో శుక్రవారం మహిళలపై అన్యాయాలు, నివారణ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ మహిళా విద్యార్థులకు చట్టాల గురించి తెలుసుకోవడం, వారి హక్కులను రక్షించుకోవడం, సమాజంలో మహిళలపై జరుగుతున్న అన్యాయాలను తగ్గించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. మహిళలకు రక్షణ చర్యలలో భాగంగా పోలీస్ శాఖ ఎప్పుడూ ముందుంటుందని ఏదైనా ఫిర్యాదు అందిన వెంటనే పోలీసు శాఖ ఎంత సత్వరంగా స్పందిస్తుందో వివరించారు. కార్యక్రమంలో మహిళ పోలీస్ స్టేషన్ డిఎస్పీ సుధాకర్ రెడ్డి, మహిళ స్టేషన్ ఎస్ఐ శాంతమ్మ, ఎస్ఈబీ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్ర రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: కేంద్ర ప్రభుత్వం దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక ఉపకార వేతనాలు మంజూరు చేస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ, సహాయ సంచాలకులు శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రీ మెట్రిక్ విద్యార్థులు 9, 10వ తరగతులు చదువుతున్నవారు ఈ ఉపకార వేతనాలకు అర్హులని, ఆగస్టు 31వ తేది లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంటర్, ఆపై తరగతులు (పోస్ట్ మెట్రిక్) చదువుతున్న విద్యార్థులు అక్టోబర్ కేంద్ర వెబ్‌సైట్‌లో "డిపార్ట్మెంట్ ఆఫ్ ఎంపవర్మెంట్ ఆఫ్ పర్సన్ విత్ డిజేబిలిటీస్"లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అన్ని అర్హతలు ఉన్న దరఖాస్తులను పరిశీలించి విద్యార్థులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో ఉపకార వేతనాలు జమ చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ శ్రమ్ కార్డుదారులకు రేషన్‌కార్డు తప్పనిసరి



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఈ శ్రమ్ కార్డు కలిగిన అసంఘటిత రంగ కార్మికులు రేషన్ కార్డు పొందే అవకాశం ఉందని, ఈ మేరకు చిత్తూరు జిల్లాలో ఆరు వేల మంది కార్మికులు ప్రభుత్వ గుర్తింపు కలిగిన కార్మికులుగా లేబర్ కార్యాలయం ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు జిల్లా కార్మిక శాఖ అధికారి ఓంకార రావు తెలిపారు. వివిధ కారణాలతో వీరికి రేషన్ కార్డులు లేకపోవడంతో కార్మిక శాఖ ద్వారా ఇలాంటి వారిని గుర్తించి రెవెన్యూ అధికారుల ద్వారా రేషన్ కార్డులు అందించే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు లేబర్ కార్యాలయం నుంచి కార్మిక శాఖ ద్వారా గుర్తింపు కార్డులు పొందిన అసంఘటిత రంగ కార్మికులకు సెల్ఫోన్ ద్వారా సమాచారం సేకరిస్తున్నట్లు చెప్పారు. చిత్తూరు జిల్లాలో ఐదు మంది అసిస్టెంట్ లేబర్ అధికారుల ద్వారా సమాచారాన్ని సేకరిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం కోసం అందించే ఈ శ్రమ్ కార్డులను బదిలీ చేయడం జరిగిందని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న అసంఘటిత రంగ కార్మికులు కూడా రేషన్ కార్డు పొందే అవకాశం ఉందన్నారు. లేబర్ కార్యాలయ అధికారులకు సరైన సమాధానాలు అందించి రేషన్ కార్డులు పొందాలని కోరారు.

దస్త్రాల దహనం కేసులో విచారణ కొనసాగుతుంది



- కొంతమంది కార్యాలయ సిబ్బందిపై అనుమానాలు
- మంటల్లో దగ్ధమైన ఫైళ్లను రికవరీ చేస్తాం
- ఫోరెన్సిక్ నివేదిక తర్వాత దోషులను పట్టుకుంటాం
- రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో దస్త్రాల దహనం కేసులో విచారణ కొనసాగుతోందని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా స్పష్టం చేశారు. గురువారం భూ బాధితుల నుంచి పెద్ద ఎత్తున అర్జీలు స్వీకరించిన సిసోడియా శుక్రవారం మరి కొంతమంది బాధితుల వద్ద అర్జీలు స్వీకరించి విజయవాడ బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మదనపల్లె దస్త్రాల దహనం కేసులో కొంతమంది కార్యాలయ సిబ్బందిపై అనుమానం ఉందన్నారు. వీరిపై శాఖా పరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. కొంత మందిపై సస్పెన్షన్ వేటు పడుతుందని, మరి కొంతమందిని అరెస్టు చేసే అవకాశం ఉందన్నారు. భూ కుంభకోణాల్లో ఎక్కువుగా ప్రమేయం ఉన్న రైస్‌మిల్ మాధవరెడ్డి పరారీలో ఉన్నాడని, అతని కోసం పోలీసు బృందాలు గాలిస్తున్నాయని పేర్కొన్నారు. అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలో 20 ఏళ్లుగా 2.16 లక్షల ఎకరాలు ఫ్రీహోల్డ్ అయ్యాయని, అందులో 4,400 ఎకరాలు రిజిస్ట్రేషన్ కూడా జరిగిపోయినట్లు తెలిపారు. పూర్తి స్థాయిలో నివేదికలు తెప్పించుకొని వాటి ఆధారంగా తీసుకోవాల్సిన చర్యలు చేపడతామన్నారు. కార్యాలయంలో సుమారు 2,400 ఫైళ్లు దగ్ధమైనట్లు గుర్తించామని వాటిని రికవరీ చేసే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా వద్దకు వచ్చిన అర్జీలను పరిశీలించగా దౌర్జన్యంగా ఆక్రమించుకున్న భూములు, డికెటి భూముల రిజిస్ట్రేషన్లు వంటివి వచ్చాయని వాటిని సెక్షన్ 145 ప్రకారం బాధితులకు అప్పగించే ప్రయత్నం చేస్తామన్నారు. ఇంకా ఎవరైనా దౌర్జన్యాలకు దిగితే పోలీస్ ప్రొటెక్షన్ కూడా కల్పిస్తామన్నారు. కోర్టులో ఉన్న భూ కేసులను కోర్టు పరిధిలోనే న్యాయం జరుగుతుందని సూచించారు. ఇప్పటివరకు తమకు 400 అర్జీలు వచ్చాయని వాటిలో ప్రతి ఒక్క అర్జని పరిశీలించి ఖచ్చితంగా బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యాలయ దహనం కేసు దర్యాప్తు విషయం మాట్లాడుతూ ఫోరెన్సిక్ నివేదిక అనంతరం కెమికల్ ఉపయోగించడం వల్ల అంత మంటలు వచ్చాయా మరే రకమైన ద్రవ పదార్థాలు వాడారా అన్న నిజానిజాలు తెలుస్తాయని, ఆ తరువాతనే దోషులను అరెస్టు చేస్తామన్నారు. ఇప్పటికే ఏడుగురిని అదుపులోకి తీసుకుని పలు కోణాల్లో విచారిస్తున్నామన్నారు. నాలుగు పోలీసు బృందాలు అదే పనిలో ఉన్నట్లు చెప్పారు.

ఒలంపిక్స్‌పై అవగాహన కల్పించండి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఒలంపిక్ క్రీడల గురించి ప్రజలకు తెలియ పరచాలని కలెక్టర్ సుమిత్ కుమార్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ వారిని ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో 26 వ తేదీ నుంచి ప్యారిస్‌లో ప్రారంభమవుతున్న 30వ ఒలిపిక్స్ పోటీలలను పురస్కరించుకొని అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ వారి చే సెల్ఫీ, స్ట్రాండీస్‌తో ఫోటోలు తీసే కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ అధికారి బాలాజీ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జాబ్ కార్డు ఉంటే చాలు.. వంద రోజుల పని



- ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి
- అవినీతికి తావులేకుండా పారదర్శకంగా జరగాలి
- డ్వామా పీడీ ఎన్.రాజశేఖర్
- మూడు మండలాల్లో పనుల పరిశీలన

ప్రజాశక్తి-విజయపురం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ ఎన్.రాజశేఖర్ అన్నారు. శుక్రవారం నగరి క్లస్టర్ పరిధిలోని విజయపురం, నగరి, నింద్ర మండలాల్లో ఎపిడి టిఎన్ శోభన్ బాబుతో కలిసి డ్వామా పీడీ ఉపాధి పనులను పరిశీలించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తొలుత నగరి మండలం వేలావడి, బుగ్గ అగ్రహారం పంచాయతీలోని నీటి కుంట పనులను వారు పరిశీలించారు. అనంతరం నింద్ర మండలం కూనమరాజుపాలెం, అత్తూరు పంచాయతీల్లో చేపల కుంట పనులు చేస్తున్న కూలీల హాజరును పరిశీలించారు. అనంతరం విజయపురం మండలం ఆలపాకం పంచాయతీ ఓరూరు గ్రామానికి చేరుకొని పర్కులేషన్ ట్యాంక్ పనులను వీక్షించి కూలీలతో ముచ్చటించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో పూలతోట సాగు, పండ్లతోట పెంపకానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. తద్వారా ఉపాధి పనులను రైతులకు అనుసంధానం చేసినట్లు అవుతుందని ఆయన వెల్లడించారు. అలాగే ప్రతి గ్రామంలో ఉపాధి పనులు చేపట్టాలని, అందులో నీటి కుంటలు, మినీ అమృత్ సరోవర్, పండ్ల తోటల పెంపకం, సరిహద్దు కందకాలు, పంట కాలువ పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తద్వారా జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్క కుటుంబానికి 100 రోజులు ఉపాధి పనులు కల్పించి ఆదుకోవాలన్నారు. అలాగే ఉపాధి పనులలో అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో నగరి, విజయాపురం ఎపివోలు కవిత, బబిత, ఈసీ శ్రీధర్, జేఈలు కిషోర్, మధుబాబు, సాంకేతిక, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

లార్వా దశలోనే దోమలను నాశనం చేయాలి

- జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: లార్వా దశలోనే దోమలను గుర్తించి నాశనం చేయాలి జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రశాంత్ నగర్ అర్బన్ ఆరోగ్య కేంద్రంలో అసిస్టెంట్ మలేరి యా అధికారి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జాతీయ డెంగీ దినోత్సవం, ఫ్రైడే డ్రైడే సందర్భంగా సిబ్బందితో కలిసి విస్తృత తనిఖీ చేపట్టారు. దోమ లార్వాలు ఎలా ఉంటాయో చూపించి లార్వాలను ఎలా నాశనం చే యాలో చేసి చూపించారు. దోమల వృద్ధిపై ప్రజలకు ఎల్లవేళలా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో స్థానిక డాక్టర్ వందన, సబ్ యూనిట్ ఆఫీసర్లు రామకృష్ణ, పీరుసాహెబ్, సూపర్వైజర్ నారాయణ, శానిటేషన్ సెక్రటరీ నిర్మల కుమారి, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

యువత ఆశయాలతో ముందుకు వెళ్లాలి



ప్రజాశక్తి-విజయపురం(నగరి): యువత నిర్ణీతమైన ఆశయాలను ఏర్పరచుకొని తమలోని శక్తిని గుర్తించి ఆశయ సాధనకు కృషి చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. కళాశాలలో 3వ సంవత్సం విద్యార్థులు నిర్వహించిన వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ డిగ్రీ చివరి సంవత్సరంలో ఉన్న విద్యార్థులు శ్రమించి విజయాన్ని స్వంతం చేసుకోవాలన్నారు. ఓటమిని గెలుపు పాఠంగా మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర రాజు, కళాశాల సాంస్కృతిక విభాగం కన్వీనర్ డాక్టర్ అరుణకుమారి, అధ్యాపకులు సుబ్రమణ్యం, డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని, డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ మహేశ్వరి పాల్గొన్నారు.

నేడు చిత్తూరులో అంగన్వాడీలకు ఇంటర్వ్యూలు


ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడి కేంద్రాల్లోని ఖాళీ పోస్టులకు దరఖాస్తులు చేసిన మహిళా అభ్యర్థులకు చిత్తూరు ఆర్‌డీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సీడీపీవో వినతశ్రీ తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని పేర్కొన్నారు. అంగన్వాడి ఇంటర్వ్యూలకు హాజరయ్యే మహిళ అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను తెచ్చుకోవాలని కోరారు.

చెత్త బుట్టలను వాడండి

ప్రజాశక్తి-కుప్పం టౌన్: కుప్పం పట్టణంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని కమిషనర్ శ్రీనివాస రావు, కడ పిడి వికాస్ మార్మాత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని బైపాస్ రోడ్డు వద్ద గల పూల మార్కెట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా దుకాణదారులను ఉద్దేశించి మాట్లాడుతూ మార్కెట్‌కు సంబంధించిన చెత్తను రోడ్లపై పడవేయకుండా చర్యలు తీసుకోవాలని, ప్రత్యేకంగా చెత్త కుండీలు ఏర్పాటు చేసుకుని వాటిలో మాత్రమే చెత్త పడవేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఇంటిలోకి చొరబడ్డ నాగుపాము

ప్రజాశక్తి-విజయపురం(నగరి): అప్పుడప్పుడూ తుంపర్లు పడుతూ వాతావరణం చల్లబడుతుండటంతో పాముల బెడద ఎక్కువైంది. నివాసాల చుట్టూ పొదలు, ఖాళీ స్థలాలు ఉన్న ప్రాంతాల్లో వీధులపైనా, పూలతొట్టెల వెనుక, ఇండ్లలోను పాములు సంచరిస్తూ నివాసితులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. మున్సిపల్ పరిధి ఏకాంబరకుప్పంలో



నూతనంగా నిర్మిస్తున్న ఇంటిలోకి సుమారు 6 అడుగుల పొడవున్న నాగుపాము చొరబడి హల్‌ఛల్ చేసింది. నివాసితులు స్థానికంగా ఉన్న స్నేక్ క్యాచర్‌కు కబురు పంపడంతో అతను చాకచక్యంగా ఆ పామును బాటిల్‌లో పట్టి అటవీ ప్రాంతాల్లోకి వదలిపెట్టాడు.

రాయితీపై పశుగ్రాస విత్తనాల పంపిణీ



ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మండలంలో పాడి రైతులకు రాయితిపై పశుగ్రాస విత్తనాలను శుక్రవారం తయ్యూరు పశువైద్యశాలలో పశు వైద్యాధికారి శ్రీవిద్య పంపిణీ చేశారు. మండలంకు 75శాతం సబ్సిడీపై వెయ్యి కిలోల జొన్నలు, 1500 కిలోల మొక్కజొన్నలు అందుబాటులో ఉన్నాయని ఆమె తెలిపారు. మార్కెట్ రేటు ప్రకారం కేజీ జొన్నలు రూ.92 కాగా 75శాతం సబ్సిడీపై రూ.23లకు, కేజీ మొక్కజొన్నలు రూ.68 కాగా సబ్సిడీపై రూ.17లకే సరఫరా చేస్తున్నామని వివరించారు. విత్తనాలు కావలసిన రైతు సోదరులు ఆధార్ కార్డ్, భూమి పట్టా పాస్ బుక్ తీసుకురావాలని కోరారు. ప్రభుత్వం అందించే ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వెదురుకుప్పం: రాయితీపై ప్రభుత్వం అందిస్తున్న పశుగ్రాస విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి ఎండి రూపసుందరి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాయితీపై ప్రభుత్వం అందజేస్తున్న జొన్నలు, మొక్కజొన్నలు విత్తనాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డెంగీ నివారణకు చర్యలు

- ప్రాథమిక వైద్యులు లోహిత్ చంగల్ రాయలు



ప్రజాశక్తి బంగారుపాళ్యం: జ్వర పీడతలను గుర్తించాలని తుంబకుప్పం ప్రాథమిక వైద్యాధికారి లోహిత్ చెంగల్ రాయలు అన్నారు. శుక్రవారం మండల కార్యాలయంలో ఆరోగ్య కార్యకర్తలు, సచివాలయ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ డెంగీ జ్వర నివారణ మాసమని ప్రస్తుతం వాతావరణంలో మార్పులకు గ్రామాల్లోని ప్రజలకు విష జ్వరాలు వ్యాప్తి చెందుతాయని వాటిని గ్రామస్థాయిలో పరిశీలించేందుకు సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. జ్వరం ఉన్న వారిని స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స పొందే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివశంకర్, వైద్య అధికారి రమేష్ పలువురు పాల్గొన్నారు.

డ్రైవర్ హత్య ఘటనలో మరో డ్రైవర్ అరెస్ట్

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: రెండు ప్రైవేటు ట్రావెల్స్ బస్సు డ్రైవర్ల ఘర్షణలో పడి మార్నింగ్ స్టార్ బస్సు డ్రైవర్ సుధాకర్‌ను కృష్ణ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ శ్రీనివాసులు ఢీకొని ఒక కిలోమీటర్ వాహనాన్ని నడిపి సుధాకర్‌ను చంపిన సంఘటనలో డ్రైవర్ శ్రీనివాసులను అరెస్ట్ చేసినట్లు శుక్రవారం స్థానిక సీఐ లక్ష్మయ్య తెలిపారు. ఈ మేరకు కోర్టుకు హాజరుపరచినట్లు వెల్లడించారు.

నాణ్యమైన భోజనం వడ్డించండి

- ఎంఈవో శ్రీరాములు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న చిన్నారులకు ప్రభుత్వ మెనూ ప్రకారం నాణ్యమైన రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని వండి వడ్డించాలని ఎంఈవో శ్రీరాములు ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను, జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనాన్ని రుచికరంగా వండి వడ్డిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో రికార్డులను పరిశీలించి విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు తమ వంతు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎల్లయ్య, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని కంభంపల్లి పంచాయతీలోని జంబుగుండ్లపల్లిలో డాక్టర్ అరుణ కుమార్ ఆదేశాలతో వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం ఆ గ్రామం మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించారు. అనారోగ్యంతో ఉన్న వారిని గుర్తించి మందులు పంపిణీ చేశారు. ఎంఎల్‌హెచ్‌పి నవీన్, ఏఎన్ఎం కవిత, ఆశ వర్కర్ ముని లక్ష్మమ్మ పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ సందర్శన



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: విద్యార్థులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థులకు ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వార్డెన్ జయకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళలకు ఆశ్రయం

ప్రజాశక్తి-తవణంపల్లి: మండలంలోని అరగొండ పరిసర ప్రాంతాలలో తిరుగుతున్న మతిస్థిమితం లేని మహిళకు పోలీసుల చొరవతో ఆశ్రయం కల్పించారు. సుమారు 35 సంవత్సరాల గల ముత్తు వల్లి అనే మహిళ మతిస్థిమితం లేక తిరుగుతుండగా తవణంపల్లి పోలీసులు విచారించారు. చిరునామా తెలపకపోవడంతో అమ్మఒడి ఫౌండేషన్ పద్మనాభ నాయుడుకి అప్పగించి ఆశ్రమంలో బాగోగులు చూడాలని ఎస్ఐ అనిల్‌కుమార్ సూచించారు.



మెప్మా ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలి

- సమగ్ర విచారణ చేపట్టాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్



ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీలో మెప్మా ఉద్యోగిగా పనిచేస్తూ ప్రజలకు అత్యధిక ఆదాయం చూపిస్తామని కోట్ల రూపాయలు వసూలు చేసి మోసం చేసిన అతనిపై చర్యలు తీసుకొని ప్రజలకు న్యాయం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు ద్వారా డబ్బులు వసూలు చేసి అత్యధిక లాభం చేకూర్చుతామని ఆశ చూపి మహిళలు మోసం చేయడం దారుణమన్నారు. ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులు ఎందుకు మీన వేషాలు వేశారని ప్రశ్నించారు. పోలీసులు ఈ ఘటనపై సమగ్ర విచారణ చేసి బాధితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలు చెల్లించిన డబ్బులను తిరిగి చెల్లించాలని కోరారు. ఇలాంటి వాటిపై ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. బాధితులకు న్యాయం జరిగేంత వరకు సిపిఎం అండగా ఉంటుందని తెలిపారు.

మోతాదుకు మించి ఇంజక్షన్ డోస్ వేస్తే కఠిన చర్యలు

- డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి



ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మోతాదుకు మించి ఇంజక్షన్ డోస్ వేస్తే కఠిన చర్యలు తప్పవు అని ఆరిమాకులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి అన్నారు. శుక్రవారం కొత్తపల్లిమిట్టలోని పిఎంపీ, ఆర్ఎంపీ క్లినిక్లను మెడికల్ షాప్‌లో అకస్మికంగా తనిఖీ చేశారు. కాలం చెల్లిన మందులు వాడిన, మోతాదుకు మించిన ఇంజక్షన్ వేసిన, స్టిరాయిడ్స్, ఆంటీబయాటిక్స్ వాడిన నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పి కవిత, హెల్త్ అసిస్టెంట్ రామ్మోహన్, ఫార్మసిస్ట్ నరేష్, ఏఎన్ఎం వరలక్ష్మి పాల్గొన్నారు.

కార్గిల్ యుద్ధంలో అమరుల త్యాగం అజరామరం

- కలెక్టర్ సుమిత్‌కుమార్



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: కార్గిల్ యుద్ధంలో వీరోచితంగా పోరాడిన అమరులందరి త్యాగం అజరామరం అని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో పోరాడిన సైనికులను ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పాకిస్థాన్‌కు భారత దేశానికి జరిగిన కార్గిల్ యుద్ధంలో 527మంది భారత సైనికులు దేశం కోసం ప్రాణాలు త్యాగం చేశారని, 1363మంది సైనికులు గాయ పడినారని, గాయపడిన వారిలో ఒకరు వినాయక రెడ్డి జిల్లా సైనిక సంక్షేమ అధికారి కార్యాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నరని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులకు ఎనిమిది మంది(8)ని, కలెక్టర్ సన్మానించి మెమెంటోను అందించారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి ఆర్.విజయ శంకర్ రెడ్డి, కార్యాలయపు సిబ్బంది, మాజీ సైనికులు పాల్గొన్నారు.

సోమల: మండల కేంద్రంలోని సోమల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా అమర వీర సైనికుల త్యాగాలను స్మరిస్తూ వారికి అంజలి ఘటించారు. కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర నాయుడు మాట్లాడుతూ దేశంలోని ఉగ్రవాదులను అంతమొందించేందుకు మన దేశ సైనికులు అలుపెరుగని పోరాటం చేసి ఎంతోమంది ప్రాణాలను త్యాగం చేసి దేశాన్ని ఉగ్రవాదుల నుంచి కాపాడారని అలాంటి అమరవీరుల త్యాగాలను దేశభక్తిని కళాశాల విద్యార్థులు గుర్తించి వారి అడుగుజాడలలో నడిచే విధంగా చదువులలో రాణిస్తూ ఉన్నత శిఖరాలను ఎదిగి దేశానికి మంచి పేరు తెచ్చే విధంగా తల్లిదండ్రులకు గుర్తింపు వచ్చే విధంగా ఎదగాలని కోరారు.

కార్వేటినగరం: ప్రతి విద్యార్థి దేశభక్తిని పెంపొందించుకోవాలని డీఎం పురం ఉన్నత పాఠశాల హెచ్ఎం కేశవులు అన్నారు. శుక్రవారం డీఎం పురం ఉన్నత పాఠశాలలో కార్గిల్ విజయ దివాస్ కార్యక్రమాన్ని పాఠశాల ఆవరణంలో విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పీఈటీ తిరుమలరాజు, సుబ్రమణ్యంరెడ్డి, వెంకటరమణయ్య, చిన్నయ్యశెట్టి, సరస్వతి, మాలతి, రంజిత్కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయపురం(నగరి): కార్గిల్ యుద్ధంలో వీరోచితంగా పోరాడిన అమరులందరినీ స్మరించుకుంటూ నగరి పట్టణంలో కార్గిల్ విజయ్ దివస్‌ను శుక్రవారం నిర్వహించారు. కార్గిల్ యుద్ధంలో వీరోచితంగా పోరాడిన అమరులందరినీ స్మరించుకుంటూ నగరి బస్టాండ్ నుండి ఓం శక్తి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు.

విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలి: జీవనజ్యోతి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: పివికేన్ ప్రభుత్వ కళాశాలలో కార్గిల్ విజయ్ దివాస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జీవనజ్యోతి మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో మరణించిన వీర జవాన్‌ల త్యాగాలను స్మరించుకోవాలని, ప్రతి విద్యార్థి దేశభక్తిని పెంపొందించుకోవాలని అలాగేఆసక్తి కలిగిన వారు సైన్యంలో చేరి దేశానికి సేవలు అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మీరా సాహెబ్, అధ్యాపకులు డాక్టర్ చెన్నకేశవులు, డాక్టర్ రాజేష్ కుమార్, ఎస్ రెడ్డి భాష అలాగే విద్యార్థులు సేవా భారతి సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



బాబోయ్.. కుక్కలు

- గ్రామ సింహాలు నివారణకు చర్యలు చేపట్టండి
- పలువురు గ్రామస్తులు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: గ్రామ సింహాలు నివారించేందుకు చర్యలు చేపట్టాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామాల్లో వీధుల్లో అధిక సంఖ్యలో గుంపులు గుంపులుగా ఉన్నాయని వీటివలన ద్విచక్ర వాహనదారులు చిన్నపిల్లలు వాటి బారిన పడుతున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. వాటిని నివారించేందుకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టక పోగా అవి విచ్చలవిడిగా వీధుల్లో సంచరించి ప్రాణహాని ప్రమాదాలు చేపడుతున్నాయని గ్రామాల్లో ప్రజలు చెబుతున్నారు. వీటిని బారిన పడి చాలామంది ఆసుపత్రుల పాలై సంఘటనలు చాలా ఉన్నాయని, వీటిని నివారించేందుకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



వేరుశనగ పంట పరిశీలన

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని ఆలప్పల్లి, నానుకుప్పంలో వేరుశనగ పొలంబడి క్షేత్రాన్ని జిల్లా రైతువనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు జి.నాగపద్మిని శుక్రవారం సందర్శించారు. వేరుశనగ పంటలో విత్తన శుద్ధి, విత్తన మోతాదు, ఎరువుల వాడకం, అతర పంటలు రక్షకీ, కంచె పంటలు ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి గీతాకుమారి, అలప్పల్లె రైతుసేవా కేంద్రం ఇన్‌ఛార్జ్ ఎస్.ముషారఫ్, గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.



తీరనున్న నీటి దాహార్తి

నేడు రేణిగుంటకు గంగ నీరు

ప్రజాశక్తి -రేణిగుంట: గత రెండు సంవత్సరాలుగా తాగు నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న రేణిగుంట ప్రజలకు సమస్య పరిష్కారం కానుంది. ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఇక్కడ నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఎన్నికల ప్రచార సమయంలో ప్రజలు పడుతున్న నీటి ఇబ్బందులను స్వయంగా చూసిన ఆయన అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీకి కట్టుబడి తెలుగుగంగ నీటిని రేణిగుంటకు విడుదల చేయనున్నారు. ఆయన చొరవతో ప్రాజెక్టు నుంచి రేణిగుంటకు ప్రత్యేక పైప్ లైన్ ద్వారా నీటిని శనివారం నుంచి సరఫరా చేయనున్నారు. గతంలో అప్పటి ఎమ్మెల్యే, మాజీ మంత్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుని సుమారు 30 కోట్ల రూపాయలతో తెలుగంగ పైప్ లైన్ ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఆ తండ్రికి తగ్గ తనయుడుగా బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం ప్రాజెక్టు వదిలి నిర్వహించిన ట్రయల్స్‌ను ఎంపీడీవో విష్ణు చిరంజీవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్ కుమార్, టిడిపి మండల అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, పట్టణాధ్యక్షుడు మహబూబాషా, క్లస్టర్ ఇన్‌ఛార్జి డి పుష్పనాథం, కన్నన్ రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి టేప్ ఎక్స్‌పో - 2024



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ది ప్లానర్స్ అండ్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 27, 28వ తేదీలలో రెండు రోజుల పాటు తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో టేప్ ఎక్స్‌పో -2024ను నిర్వహిస్తున్నట్లు ఆ అసోసియేషన్ ఛైర్మన్, అధ్యక్షులు కె.వెంకటేష్ బాబు, ప్రసాద్ రెడ్డి తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరులతో వారు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా నిర్మాణ రంగంలో వస్తున్న ఆధునిక టెక్నాలజీ విధానాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులోతీసుకొస్తూ ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రతి ఏటా టేప్ ఎక్స్‌పోను ప్రదర్శిస్తున్నామన్నారు. ప్రస్తుతం రెండు రోజుల పాటు నిర్వహించే ఈ ఎక్స్ పో ప్రదర్శనలో బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్, మ్యానుఫ్యాక్చర్స్ సంబంధించిన అన్ని రకాల ప్రాపర్టీస్, మేటీరియల్స్, టెక్నాలజీస్, మెషినరీ అండ్ ఎక్విప్‌మెంట్ ఎగ్జిబిషన్ తో పాటు ఎక్సుర్ట్స్ తో పరిచయ, అవగాహన సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. అంతేకాక సొంత ఇంటి కలలను నెరవేర్చుకోవడంతో పాటు ఆధునిక విధానంలో ఇంటి నిర్మాణాన్ని నిర్మితం చేసుకునే వారికి ఈ టేప్ ఎక్స్‌పో చక్కటి మార్గ దర్శకంగా తోడ్పడు తుంద న్నారు. ఈ ప్రదర్శనకు వచ్చే సందర్శ కులకు కూపన్ల ద్వారా గంట గంటకు లక్కీడిప్ ద్వారా అక్షణీయమైన బహుమతులు అందిస్తా మన్నారు. ఈ అవకాశాన్ని ప్రజ లందరూ సద్వినియోగం చేసుకో వాలని కోరారు. ఈ సమావేశం లో అసోసియేషన్ కార్యదర్శి షణ్ముగం, మదన్ గోపాల్, సభ్యులు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగదారులకు ఈకేవైసీ తప్పనిసరి

ప్రజాశక్తి-శాంతిపురం: మండలంలోని హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులు విధిగా ఈకేవైసీ చేయించుకోవాలని నిర్వాహకులు మంజునాథ్ రెడ్డి పేర్కొన్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా అందిస్తామని ప్రకటన చేసిన నేపథ్యంలో ఈకేవైసీ నమోదు తప్పనిసరి కానున్నట్లు ఆయన తెలిపారు. ఈ క్రమంలో వినియోగదారులు విధిగా శాంతిపురం ప్రభుత్వ హాస్పటల్ ఎదురుగా ఉన్న తమ హెచ్‌పీ గ్యాస్ వాల్యూ షాప్, రాళ్ళబుదుగురు సమీపంలోని రామిగానిపల్లి వద్ద ఉన్న తమ ప్రధాన కార్యాలయంలో తమ వేలిముద్రలు లేదా ముఖ గుర్తింపు నమోదుతో ఈకేవైసీ చేయించుకోవాలని ఆయన కోరారు.

కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-రామకుప్పం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విజిలాపురంలో వైద్య అధికారి డాక్టర్ పూజిత ఆధ్వర్యంలో శుక్రవారం కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. కంటి సమస్యతో బాధపడుతున్న వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి, క్యాటరేట్‌తో బాధపడుతున్న వారికి, అలాగే కంటిలో పొర పెరిగిన వారిని గుర్తించి కొందరికి మందులు మాత్రులు పంపిణీ చేశారు. దాదాపు 140మందికి పరీక్షలు నిర్వహించగా కొంతమంది కాట్రాక్టు అనగా కంటిలోని బాధతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి ఆగస్టు 11వ తేదీన ఉచిత కంటి ఆపరేషన్ చేయటానికి సిఫార్సు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సాయి శ్రీ, వైద్య సిబ్బంది, హెల్త్ అసిస్టెంట్ బాలు, ఆప్తాలమిక్ అసిస్టెంట్ బాలచందర్ పాల్గొన్నారు.

సర్పంచ్ చొరవ.. పారిశుద్ధ్య పనులు విస్తృతం



ప్రజాశక్తి-గుడిపల్లి: ప్రజలందరూ విష జ్వరాలతో తగిన ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సర్పంచ్ రీటా ఎల్లప్ప పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని శెట్టిపల్లి పంచాయతీ శెట్టిపల్లి, చిన్నశెట్టిపల్లిలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మురుగునీటి కాలువలు శుభ్రం చేయించి బ్లీచింగ్ పిచికారి చేయించారు. గ్రామాల్లో ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- కాదంటే 10 నుంచి దీక్షలు చేపడతాం

- స్వచ్ఛభారత్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: గ్రీన్ అంబాసిడర్ల దీర్ఘకాలిక పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ ఆగస్టు 10వ తేదీ నుంచి రిలే దీక్షలకు పూనుకోనున్నట్లు స్వచ్ఛభారత్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు తెలిపారు. యూనియన్ జిల్లా కమిటీ సమావేశం ఎస్‌టీయూ కార్యాలయంలో ఎస్.గోవింద స్వామి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ గతంలో అధికారంలో ఉన్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం స్వచ్ఛ భారత్ పారిశుధ్యం కార్మికులకు 20 నుంచి 25 నెలల జీతాలు చెల్లించకుండా అన్యాయం చేయడంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం జీతాలు రాకపోవడంతో కార్మికుల కుటుంబాలు ఇబ్బందులకు గురి అవుతున్నాయన్నారు. కార్మికుల కుటుంబాల బాధలను మానవతా దృక్పథంతో ఆలోచించి అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం అయినా జోక్యం చేసుకొని కార్మికులకు రావలసిన పెండింగ్ జీతాల మంజూరుకు చర్యలు తీసుకొని ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆగస్టు 10 నుంచి దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఏఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు నాగరాజు, నగర కార్యదర్శి దాసరి చంద్ర, మణి, రఘు, గోవింద స్వామి, ఏసు పాదం, మునేయ్య, సంజయ్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల అవకతవకలపై విచారణ

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: యర్రావారిపాలెం మండలంలో 2023- 24 సంవత్సరంలో నిర్వహించిన ఉపాధి హామీ పనులకు 12 పంచాయతీలలో పది రోజులుగా జరిగిన ఆడిటింగ్ పై శుక్రవారం సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ హాజరయ్యారు. సంవత్సర కాలంలో మండల వ్యాప్తంగా 1567 ఉపాధి పనులు నిర్వహించారని వాటికి రూ.11 కోట్లు ఖర్చు అయిందని మండల ఉపాధి హామీ సిబ్బంది తెలిపారు. దీనిపై నిర్వహించిన ఆడిట్లో డిఆర్‌పిలను, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్‌లను బహిరంగ సభలో విచారించారు. ఈ విచారణలో 12 పంచాయతీలో అక్కడక్కడా వర్కులు చేయకపోయినా బిల్లులు పెట్టారని పాత వర్కులకు, యంత్రాలతో చేసిన వర్కులకు బిల్లులు పెట్టారని డిఆర్‌పిలు ఆరోపించారు. దీంతో డ్వామా పీడీ ఉపాధి సిబ్బందికి చేసిన పనుల అవకతవకలపై మరో సారి విచారణ చేపట్టాలని హెచ్చ రించారు. విచారణలో నిజాలు తేలితే ఉపాధి హామీ మండల సిబ్బంది తగిన మూల్యం చెల్లించి నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధి హామీ సిబ్బంది, సర్పంచులు, ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.

ఆగస్టు 4 నుండి సప్త జ్యోతిర్లింగ దర్శన్ యాత్ర

తిరుపతి ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ వేణుగోపాల్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి ఐఆర్‌సీటీసీ భారతీయ రైల్వే అనుబంధ సంస్థ 'భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు సప్త జ్యోతిర్లింగ దర్శన్ యాత్ర కు ప్రత్యేక రైలు నడుపుతున్నారు. ఆగస్టు 4వ తేదీ నుంచి 12వ తేదీ వరకు 'సప్త జ్యోతిర్లింగ దివ్యదర్శన్ యాత్ర' ప్రారంభం కానుందని తిరుపతి పరిసర జిల్లా ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి రైల్వే స్టేషన్ ఏరియా మేనేజర్ వేణుగోపాల్ సంయుక్తంగా ప్రకటన ద్వారా తెలిపారు. అరుణాచలం, కన్యాకుమారి, మధురై, రామేశ్వరం, తంజావూరు, తిరుచ్చి, త్రివేండ్రం వంటి 7 క్షేత్రాలను సందర్శించనున్నట్లు పేర్కొన్నారు. ఆగస్టు 4వ తేదీ నుంచి 12వ తేదీ మధ్యాహ్నం వరకు యాత్ర ఉంటుందన్నారు. యాత్రా సమయంలో ఉదయం టీ, టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం (వెజిటేరియన్) అందించనున్నట్లు తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభమై విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా యాత్ర ప్రారంభం అవుతుందన్నారు. స్లీపర్ క్లాస్ రూ.14,250, 3ఏసీ రూ.21,900, 2 ఏసీ రూ.28,450 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎల్‌టీసీ (సెలవు ప్రయాణ భత్యం) సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చన్నారు. స్లీపర్ క్లాస్ వారికి రాత్రి బస నాన్ ఏసీ గదులు కేటాయించడంతోపాటు ఒక్కో గదికి ముగ్గురు లేదా నలుగురు ఉండాల్సి ఉంటుందన్నారు. వీరికి రైలుప్రయాణంలోనూ నాన్ ఏసీ ఉంటుందని తెలిపారు. 3 ఏసీ బుకింగ్ వారికి రాత్రి బస చేయడానికి ఏసీ గదుల సౌకర్యం ఉంటుందని.. బడ్జెట్ హోటల్‌లోనాన్ ఏసీ గదుల సౌకర్యం ఉంటుందని.. రైలు ప్రయాణం సైతం నాన్ ఏసీ ఉంటుందన్నారు. 2 ఏసీ బుకింగ్ చేసుకున్న వారికి గదుల సౌకర్యంతోపాటు పూర్తిగా ఏసీ ప్రయాణం ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు ఐఆర్‌సీటీసీ కార్యాలయం, మూడో అంతస్తు, రైల్వే రిజర్వేషన్ కాంప్లెక్స్‌లో గాని, పవన్‌కుమార్ 8287932313, యేసయ్య 9281495853 నంబర్లను సంప్రదించాలని కోరారు. ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ హెచ్‌టిటిపి: డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఐఆర్‌సిటిసి టూరిజం .కామ్ వెబ్‌సైట్‌ను సంప్రదించ వచ్చని మేనేజర్ వేణుగోపాల్ తెలిపారు.

తిరుపతి ఎయిర్‌పోర్టు పేరు మార్పు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: రాష్ట్రంలోని ఎయిర్‌పోర్టుల పేర్లకు సంబంధించి ప్రతిపాదనలు కేంద్రానికి పంపింది. తిరుపతి ఎయిర్‌పోర్టును శ్రీవేంకటేశ్వర, విజయవాడ విమానాశ్రయానికి నందమూరి తారకరామారావు, కర్నూలు ఓర్వకల్లు విమానాశ్రయానికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేర్లను ప్రతిపాదించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి మూడు విమానాశ్రయాలకు పేర్లను సూచిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపినట్లు పౌరవిమానయాన సహాయ మంత్రి మురళీధర్ మొహుల్ పార్లమెంట్ సమావేశాల్లో ఒక ప్రశ్నకు లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. తిరుపతి విమానాశ్రయం 1999 సంవత్సరంలో శ్రీ వెంకటేశ్వర విమానాశ్రయం పేరు మార్చాలని అప్పట్లో ప్రతిపాదించగా అప్పటి ఎన్ డి ఏ ప్రభుత్వం పేరు మార్చడానికి టిటిడి కొంత ఆర్థిక సహాయం ఇవ్వాలని కేంద్ర విమానాయ శాఖ కోరింది. అయితే టీటీడీ అంత నిధులు ఇవ్వడానికి నిరాకరించింది. అప్పట్లో పేరు మార్పు సాధ్యం కాలేదు. రాష్ట్రంలో కూటం ప్రభుత్వం అధికారం రావడంతో విమానాశ్రయ పేరు మార్చడానికి ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రతిపాదనలపై కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

మాతా శిశు మరణాల నివారణే లక్ష్యం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్: మాతాశిశు మరణాల నివారణే లక్ష్యంగా వైద్య సిబ్బంది పని చేయాలని తిరుపతి జిల్లా టాస్క్‌ఫోర్స్ ప్రధాన అధికారి డాక్టర్ శ్రీనివాస రావు ఆదేశించారు. టాస్క్ ఫోర్స్ బృందంలోని జిల్లా గణాంకాధికారి నాగేంద్ర కుమార్, ఇన్‌ఛార్జి డీపీహెచ్ ఎంఓ బేబిరాణి, డీపీఓ ప్రకాష్ మండలంలోని పలు విలేజ్ హెల్త్ క్లినిక్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు, గర్భిణులు, బాలింతలు రక్తహీనతతో మరణించకూడదని, అందుకు సంబంధించిన వైద్య సదుపాయాలు సకాలంలో అందించి, రక్తహీనత సమస్య లేకుండా చూడాలన్నారు. ప్రతి కాన్పు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగేలా చూడాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలిం తలు, గర్భిణులకు ఇచ్చే బల వర్ధక ఆహారాన్ని ప్రతి ఒక్కరూ సద్విని యోగం చేసుకునేలా చూడాలని కోరారు. ఎప్పటి కప్పుడు గ్రామా ల్లో సీజనల్ వ్యాధు లపై అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామ స్థాయిలో పరిసరాల పరిశు భ్రతకు ప్రాధాన్యత ఇచ్చి దోమల నివారణకు చర్యలు తీసుకో వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏంపేడు ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి సుధీర్ కుమార్, వైద్యులు రాహుల్ రాజ్, హెల్త్ సూపరువైజరు మంజుల, ఏఎన్ఎంలు ఎమ్ఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.



గోవిందమ్మ ఆలయానికి పూర్వ వైభవం

ఆలయ ధర్మకర్త మండలి వెల్లడి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మున్సిపాల్టీలోని గేట్ పుత్తూరులోని గోవిందమ్మ ఆలయానికి పూర్వ వైభవం తెస్తామని ఆలయ ధర్మకర్తలి మండలి వెల్లడించింది. ధర్మకర్త మండలి ఎంఎంపొన్నుస్వామి అధ్యక్షతన పుత్తూరు మాజీ ఎంపీపీ డిఎన్, పుత్తూరు మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ డిఎస్ గణేష్ ఆధ్వర్యంలో గోవిందమ్మ ఆలయం అభివృద్ధిపై శుక్రవారం చర్చించారు. అనంతరం నగరి నియోజక ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ అత్యధిక మెజార్టీతో గెలిచినందుకు మొక్కుబడిగా108 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గోవిందమ్మ ఆలయ పరిసరాల్లో శుభ్రత పాటించాలని, గుడికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మొక్కులు చెల్లించేలా సౌకర్యాలు కల్పించాలని, ఆలయంలో బోరు బావికి మరమ్మతులు చేసి మంచినీటి సౌకర్యం కల్పించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో విడి అశోక్, ఎస్ బాలాజీ, ఎంఎస్ శేఖర్, ఇళయరాజా, పిఎస్ రాజా, ఎంకె శంకర్, ఏజి నటరాజన్, ఎంజి కైలాసం, గ్రామ పెద్దలు ఎంకె అర్ముగం, ఎంకే వేలన్, పి కుమరన్, ఎన్‌సి శేఖర్, ఎమ్ఎస్ గణేశన్, ఎమ్‌వి గోవిందన్, రాజా, సురేష్, ఎమ్ఎస్ కృష్ణన్, అప్పస్వామి, సుందరం పాల్గొన్నారు.